క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి చంద్రశేఖర్‌రావు

ఖమ్మం లీగల్: బాలబాలికలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కె.వి.చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన సింగరేణి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడారు. బాల బాలికలు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని, ముఖ్యంగా లైంగిక నేరాలపై అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలను శారీరకంగా, మానసికంగా వేధించినా పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు అమలు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన

కూసుమంచి: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం బృందం కాలనీని సందర్శించి అక్కడి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నాక మాట్లాడారు. కాలనీలో వీధిలైట్లు లేవని, వర్షం వస్తే రహదారి అంతా బురదమయం అవుతుందని, తాగునీరు సక్రమంగా రావడం లేదన్నారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు గోపె వెంకన్న, నెల్లూరి వెంగళరావు, మీసాల వెంకటేశ్వర్లు, కొక్కిరేణి వెంకన్న, బాలయ్య, నాగేశ్వరరావు, గురవయ్య, రమేష్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్ : నగరంలోని పలు కూడళ్లలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన భారీ సెట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. ఈనేపథ్యాన ఇందిరానగర్‌లోని బాలాగణపతి దేవాలయంలో బాలగణపతి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి దేవాలయంలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ డీవీ నర్సింహారావు, నిర్మాణ అధ్యక్షుడు బాజిన్ని వీరయ్య, అర్చకులు ఎ.గిరిధర్, తిరుపతిరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్లు..

తిరుమలాయపాలెం: ఈ నెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం, జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలులో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించాక మాట్లాడారు. రైతు సమస్యలపై పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈ మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, ఆరెంపుల వెంకన్న, బానోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీ.టీ. క్రీడాకారులకు అభినందన

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనిబాల శుక్రవారం అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలకు వచ్చిన సందర్భంగా ఖమ్మం జిల్లా జట్టుతో ప్రత్యేకంగా పరిచయం చేసుకుని క్రీడాకారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్షుడు బాలసాని విజయ్, కార్యదర్శి వీవీఎస్ మూర్తి, చలపతి, షేక్ ముజర్, శ్రీరెడ్డి సాయి శివ పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు



వేడుకలో పాల్గొన్న మున్నూరు కాపు సంక్షేమ సంఘం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: సినీనటుడు, పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ కొణిదెల చిరంజీవి జన్మదిన వేడుకలను ఖమ్మం జిల్లా మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం మున్నూరుకాపు భవన్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పెచ్చులూడుతున్నాయ్..



పండితాపురం పశు వైద్యశాల భవనంలో పెచ్చులూడిపోయిన స్లాబ్



శిథిలావస్థలో ఉన్న కామేపల్లి పశు వైద్యశాల భవనం

శిథిలావస్థలో పశు వైద్యశాలలు

- ఊడిపడుతున్న స్లాబ్ పెచ్చులు, బీటలు వారిన గోడలు
- కనీస సౌకర్యాలు కరువు
- బిక్కుబిక్కుమంటూ విధులు
- ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన

కామేపల్లి: మండలంలోని కామేపల్లి, పండితాపురం పశు వైద్యశాలలో విధులు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యశాలలు శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో భవన పైకప్పు పెచ్చులూడి పడుతుండగా.. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని వైద్యులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

యాంత్రీకరణ పెరగడంతో..

దశాబ్దకాలం నుంచి వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, వ్యవసాయ పనులు చేసే వారు తగ్గుతుండడంతో పశుసంపద కూడా తగ్గుతూ వస్తోంది. గతంలో ఇంటికి నాలుగైదు గేదెలు, ఎద్దులు, ఆవులు పెంచేవారు. ప్రస్తుతం యాంత్రీకరణ పెరగడంతో పశు పోషణ భారంగా మారి రైతులు రానురాను తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో ప్రభుత్వాలు సైతం పశువుల ఆస్పత్రులను సైతం పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నివేదిక సిద్ధం..

ఇటీవల కామేపల్లి పశు వైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో భవన నిర్మాణానికి నివేదిక పంపాలని కలెక్టర్ చెప్పడంతో సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులు పంపించాం. పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయని, వర్షం వస్తే ఉండడానికి వీలు లేకుండా స్లాబ్, గోడల నుంచి నీళ్లు కారుతున్నాయని పేర్కొంటున్నారు. కనీస సౌకర్యాలు కూడా లేవని, విధులు నిర్వర్తించాలంటే భయంగా ఉందని వైద్యాధికారులు తెలిపారు.

సౌకర్యాలు నిల్..

వందలాది పశువులు, గొర్రెలు, మేకలకు నిత్యం వైద్య సేవలు అందుతూనే ఉంటాయి. ఈ ఆస్పత్రుల్లో కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. వర్షం వస్తే కప్పు, గోడ పగుళ్ల నుంచి నీరు గదుల్లోకి వస్తున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న దవాఖానా భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితిలో ఉంది. అన్ని శాఖలకు సంబంధించిన భవన నిర్మాణాలకు రూ.కోట్లు ఖర్చు పెట్టి అధునాతనంగా నిర్మిస్తున్నారు. దవాఖానాల శిథిలావస్థకు చేరుకున్నా.. కనీస మరమ్మతులు చేపట్టడం లేదని రైతులు, జీవాల కాపరులు వాపోతున్నారు.

కూలిపోయేలా ఉంది.



పశువుల ఆస్పత్రి పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయేలా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియదు. కొత్త భవనానికి నిధులు మంజూరు చేసేంత వరకు ఇతర భవనంలోకైనా మార్చాలి. లేకుంటే ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి భవనాన్ని నిర్మించాలి.

– మేకపోతుల రామ్మూర్తి, పండితాపురం

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



ఖమ్మం సహకారనగర్: శ్రీరామకృష్ణ విద్యాలయంలో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంసహకారనగర్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్ శ్రీశ్రీ సద్గురు సాయినాథ్ మందిరంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా సామూహిక కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని పూజించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా.. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, వల్లభనేని శ్రీనివాసరావు, రామారావు, కార్పొరేటర్ వలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించగా.. విభాగ అధ్యక్షుడు దేవాకి వాసుదేవరావు, విభాగ కార్యదర్శి కరవది వెంకట శ్రీనివాసరావు, పాఠశాల అధ్యక్షురాలు దేవాకి రూపావతి, ప్రిన్సిపాల్ సంతోష గౌతమ్ పాల్గొన్నారు.

▶ గాజులమ్మగా పెద్దమ్మతల్లి

ఖమ్మం గాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ ప్రాంతం పంపింగ్ వెల్‌రోడ్‌లో గల శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని శ్రావణ మాస చివరి శుక్రవారం కావడంతో భక్తులు వేలాది గాజులతో అలంకరించారు. అనంతరం లలితా పారాయణం చేయగా.. భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.



గాజులమ్మ తల్లి అవతారంలో పెద్దమ్మతల్లి

▶ రెండో రోజు హోమ పూజలు

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్ గుట్టపై ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ సోమలింగేశ్వరస్వామి వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం హోమ పూజలు ఘనంగా నిర్వహించారు. జగద్గురు శ్రీ వేమనారాధ్య పీఠాధిపతి శ్రీ పూర్ణానంద స్వామి సమక్షాన పూజలు జరగగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ బాధ్యులు జీడిమెట్ల రాంబాబు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

▶ జరిమానా..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 16వ డివిజన్ శ్రీరామనగర్ రోడ్డు నంబర్ 13లో ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చినా స్థలాలను శుభ్రం చేయకపోవడంతో కేఎంసీ అధికారులు రూ.2 వేలు జరిమానా విధించారు. వర్తక సంఘం రోడ్డులో సింగిల్ యూజ్ కవర్లు ఉపయోగిస్తున్న నూడిల్స్ పాయింట్ యజమానికి, ఎలక్ట్రికల్ షాపు యజమానికి రూ.1,000, రూ.1,500లు చొప్పున జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ కవర్లను వినియోగించొద్దని యజమానులను అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య ఉన్నారు.

▶ ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

నగరంలోని 60 డివిజన్ల పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌ను వేగవంతం చేయాలని వార్డు ఆఫీసర్లను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. గురువారం కమిషనర్ తన చాంబర్‌లో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి ఎంత మందికి పట్టాలు ఇచ్చారు, ఎన్ని ఇళ్లకు ముగ్గులు పోశారు, ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయని సమీక్షించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇళ్ల గ్రౌండింగ్ సంఖ్య తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. వెంటనే ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి వార్డు ఆఫీసర్ తమ పరిధిలోని లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. వచ్చే వారం రోజుల్లో కనీసం 80 శాతం పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.



వార్డు ఆఫీసర్లతో సమీక్షిస్తున్న కమిషనర్ అగస్త్య

భోజన నాణ్యతలో రాజీ పడొద్దు



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదులు, పరిసరాలు, కూరగాయాలతో పాటు పలు రికార్డులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారితో కాసేపు ముచ్చటించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకుని వంట ఏజెన్సీలకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలతో భోజనం అందించకుంటే సహించేది లేదని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు ఇంటి వద్ద ఉంటున్నామనే భావన కల్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షోయాబుల్లాఖాన్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: తొలితరం జర్నలిస్టు మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన షోయాబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం గ్రామస్తులు ఆయన స్మారక విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. నైజాం నవాబును తన రచనలతో ఎదిరించి అనేక నిర్బంధాలను ఎదుర్కొన్న కలం యోధుడని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి మాజీ సర్పంచ్‌లు మండడి ఇజ్రాయిల్, భూక్యా వీరన్న, గ్రామస్తులు సత్యం, సుమన్ రెడ్డి, అనిల్, ఆంజనేయులు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

▶ వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలానికి చెందిన ముగ్గురు శుక్రవారం వేర్వేరుగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప, ఆచార్లగూడెంకు చెందిన వీరబాబు, చెరువుమాధారానికి చెందిన లక్ష్మి(40) వారి ఇళ్లలో పురుగుల మందు తాగగా కుటుంబీకులు నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అయితే, వీరి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

▶ కత్తితో దాడి .. కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీరామ్‌నగర్‌లో కత్తితో దాడి ఘటనలో శుక్రవారం పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్సై కె.మధుబాబు కథనం ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌రోడ్డు నంబర్ -1లో భూ సంబంధిత వివాదం కారణంగా చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన తూము అంజయ్యపై కత్తితో దాడి జరిగింది. ఈ దాడిలో అంజయ్యకు తీవ్ర రక్తగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు నిందితుడు శ్రీరామ్‌నగర్‌కు చెందిన తన్నీర్ శ్రీను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

▶ కారుపై దాడి ఘటనలో..

రఘునాథపాలెం: మండల కేంద్రంలో కారు వేగంగా నడిపాడనే నెపంతో యజమాని ఈర్లపూడికి చెందిన మాలోతు మహేష్‌పై ఈనెల 18న ముగ్గురు దాడి చేశారు. అలాగే, కారు అద్దాన్ని ధ్వంసం చేయగా ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

▶ ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. చిమ్మపూడి గ్రామానికి చెందిన వెలమరెడ్డి వెంకటరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఖమ్మం నుంచి డోర్నకల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో గాయపడిన వెంకటరెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. అతడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం పనుల జాతర కార్యక్రమంలో భాగంగా జగన్నాథతండాలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన, కొత్తలింగాలలో కోళ్ల ఫారమ్ మదర్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా ఇంటింటికి సంక్షేమ పథకాలు చేరవేస్తూ ప్రజాపాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, కామేపల్లి, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, తోటకూరి శివయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, ఏపూరి మహేందర్, ఇట్టా శ్రీను, గుగులోత్ గబ్రూనాయక్, మాలోత్ బావ్‌సింగ్, కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, సురభి వీరన్న, అర్వపల్లి జగదీష్, దేవండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పనుల జాతర' ప్రారంభం..



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష

తిరుమలాయపాలెం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాలను రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష అన్నారు. శుక్రవారం ఉపాధి పథకం పనుల జాతర కార్యక్రమంలో పాల్గొని గతేడాది కింద మంజూరైన పనులను ప్రారంభించి, ఇంకా ప్రారంభం కావాల్సిన పనులపై నిర్వహించిన గ్రామ సభల్లో ఆమె మాట్లాడారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న సన్న చిన్నకారు రైతులు కోళ్ల ఫామ్, డ్రాగన్ ఫ్రూట్, సపోట పండ్ల తోటలకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ మేరకు తిరుమలాయపాలెంలో ఒక కోళ్ల ఫామ్‌ను, పిండిప్రోలులో ఒక క్యాటల్ షెడ్‌ను, సంత ప్రదేశంలో కమ్యూనిటీ టాయిలెట్ బ్లాకు పనులను ప్రారంభించారు. అనంతరం ఉపాధి పథకంలో పనిచేసిన దివ్యాంగులను, 100 రోజులు పనిచేసిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, పీఆర్ ఏఈ ప్రఫుల్, ఏపీఓ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు రాము, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న వారితో మార్కెట్ చైర్మన్ , నాయకులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్, 22వ డివిజన్‌లకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పట్టాలు, రూ.లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళీ, దొడ్డ అశోక్, తుంపాల కృష్ణమోహన్, పర్వత శ్రీను, కె.రమేష్, ఝాన్సీ, లక్ష్మీనారాయణ, చింతల ఉపేందర్, ఫరీద్ ఖాద్రీ, గొడుగు రమాదేవి, సాయి, కోటయ్యరాజు, మండల పుల్లయ్య, నరేష్, పొదిలి భిక్షం, రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 57వ డివిజన్‌లో లబ్ధిదారులకు కార్పొరేటర్ ఎండీ రఫీథ ముస్తఫా ఆధ్వర్యాన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ముస్తఫా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప వాసులకు ప్రత్యామ్నాయం చూపాలి



స్థానికులతో మాట్లాడుతున్న అశోక్

ఖమ్మం రూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ ఒకటో వార్డులో 21 ఏళ్ల క్రితం నిర్మించిన రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న పేదలను అక్కడ నుంచి తరలించి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజీవ్ గృహకల్ప ఏరియాలో మాస్‌లైన్ ప్రతినిధి బృందం పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలతో వారు మాట్లాడి అక్కడున్న పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వరుసగా వరద ముంపు కారణంగా అపార్ట్‌మెంట్ బలహీనపడిందని, ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదకరస్థితిలో వారు నివాసం ఉంటున్నారన్నారు. పేదరికం కారణంగా ఎటూ వెళ్లలేని స్థితిలో ఉన్న వారికి ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఈ సమస్యకు పరిష్కారం చూపని వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, జిల్లా నాయకులు ఝాన్సీ, కె.శ్రీనివాస్, ఆజాద్, శోభ, జాస్మిన్, రామారావు, శారద, సుజాత, కళ్యాణి, శ్రీలక్ష్మి, అంజమ్మ, రాణి, భవాని, జయమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు రైతు రాజ్యం తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో మొండి చేయి చూపిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో నంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన పార్టీ పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కోసం రైతులు సొసైటీల దగ్గర బారులుదీరుతున్నా దొరకట్లేదని, కార్పొరేట్ సంస్థలతో మిలాఖత్ అయిన ప్రభుత్వాలు రైతులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. వెంటనే అవసరం ఉన్న ప్రతి రైతుకు యూరియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరఫున సీపీఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. అనంతరం డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడగా.. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు బుగ్గవీటి సరళ, యర్రా శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్, మల్లెల హనుమంతరావు, ఊరడి సుదర్శన్ రెడ్డి, శీను తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఈ ప్రాంగణానికి దారేది..?

విద్యార్థులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణానికి దారి కరువైంది. ఖమ్మం- ఇల్లెందు రోడ్డులో రఘునాథపాలెంలోని కేజీబీవీ పాఠశాల ఎదురుగా విద్యార్థుల కోసం తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఖమ్మం-ఇల్లెందు రోడ్డుకు నాలుగు లైన్లు మంజూరు కాగా రోడ్డు పక్కన మట్టి తొలగించడంతో ఈ క్రీడా ప్రాంగణానికి వెళ్లేందుకు దారి లేకుండాపోయింది. దీంతో ఆడుకునేందుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.



– స్టాఫ్ ఫొటోగ్రాఫర్